నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 24 జనవరి 2024 | KAMAREDDY



సిద్ధాపూర్ రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి


## నేతాజీకి ఘన నివాళి
డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ పాఠశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

# సిద్ధాపూర్ రిజర్వాయర్ పూర్తికి కలిసికట్టుగా కృషి

**బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**

వర్ని, జనవరి 23: వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తికావడం కోసం బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయకట్టు రైతులు కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు నెలల నుంచి పనులు నిలిచిపోయాయని కాంట్రాక్టర్‌తో పాటు స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనుల నిమిత్తం అవసరమైన మొరాన్ని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఒక ప్రాంతం నుంచి తరలిస్తుండగా కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని స్థానికులు వెల్లడించారు. స్పందించిన ఎమ్మెల్యే పోచారం అభివృద్ధి పనులను అడ్డుకోవడం అవివేకమని, ఐక్యంగా ఉంటూ రిజర్వాయర్ పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా రిజర్వాయ ర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ వాసంతి, డిప్యూటీ ఈఈ శ్రావణ్ కుమార్, ఏఈ శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ అధికారి పద్మారావ్, వర్ని జడ్పీటీసీ సభ్యుడు బర్దావల్ హరిదాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, నాయకులు మేక వీర్రాజు, భర్త్యానాయక్, గాజీరాం ఉన్నారు.



# బీజేపీలో అంతర్యుద్ధం

**చిచ్చురేపుతున్న అధ్యక్ష పదవులు**

- ఎంపీ అర్వింద్ తీరుపై సీనియర్ల గుర్రు
- ఏకపక్ష నిర్ణయాలపై అధిష్టానానికి ఫిర్యాదులు
- లోక్‌సభ టికెట్ ఇవ్వొద్దంటూ భారీగా విన్నపాలు
- అమిత్‌షాను కలిసిన ఇందూరు బీజేపీ ముఖ్యనేతలు

నిజామాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**భారతీయ** జనతా పార్టీలో పదవుల పందేరం సరికొత్త అంతర్యుద్ధానికి తెర తీసింది. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి జారీ చేసిన జిల్లా అధ్యక్షుల జాబితాలో పారాచూట్ నేతలకే పెద్దపీట వేయడంపై సీనియర్లంతా గుర్రుమంటున్నారు. పార్టీని అంటిపెట్టుకొని దశాబ్దాలుగా సేవలు అందించిన వారిని కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేయడంపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లుగా తెలుస్తున్నది. కేంద్రంలో అధికారంలోకి రాకముందు నుంచి జీవితాలను త్యాగంచేసి పనిచేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వకుండా పారాచూట్ నేతలనే కీలకస్థానాల్లో కూర్చోబెట్టడం ఏంటంటూ రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలకు జిల్లాకు చెందిన కీలకనేతలు వరుస ఫిర్యాదులు అందించారు. బీజేపీలోకి వచ్చి ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్‌తో సహా నిజామాబాద్ జిల్లా పూర్వ బీజేపీ అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, నూతనంగా బీజేపీ జిల్లా సారథిగా నియమితులైన కులాచారి దినేశ్‌కు బీజేపీ భావజాలమే తెలియదని... అలాంటి వారంతా పార్టీలోకి ఇలా వచ్చి అలా పదవులు అందుకోవడం ఏంటంటూ ప్రశ్నించినట్లుగా తెలుస్తున్నది. ఎంపీ అర్వింద్ తన ఆధిపత్యాన్ని చెలాయించుకోవడం కోసమే ఇదంతా చేస్తున్నట్లుగా హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు ఫిర్యాదులు సైతం చేసినట్లుగా సమాచారం.

### అర్వింద్‌కు ఎంపీ టికెట్ వద్దు..

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీలోకి వచ్చి పసుపు బోర్డు హామీతో ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్ తదనంతరం నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి చేసిన మేలు అంటూ ఏదీ లేదు. పైగా బీజేపీ బలోపేతం కోసం కృషి చేసిన దాఖలాలు కూడా లేవు. నిత్యం బీఆర్ఎస్ పార్టీపై నోరు పారేసుకోవడం తప్పా చేసిందేమీ లేదన్నది ప్రజలందరికీ తెలిసిందే. ఎంపీగా అర్వింద్ పనితనంపై జనాల్లో తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. మాటలకే కానీ చేతలకు పనికిరాని అర్వింద్‌తో ఉపయోగం లేదంటూ ఇప్పటికే జనాలంతా డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగానే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన ధర్మపురి అర్వింద్ ఘోరంగా ఓటమి చవిచూశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా ఓటమి ఖాయమన్న సంకేతాలను గ్రహించే అర్వింద్ ఈ రకమైన ప్రయోగం చేసినట్లుగా బీజేపీలో చాలా మంది నేతలంతా గ్రహించారు. అర్వింద్ ఒకటి తలచితే మరోటి అయినట్లుగా కోరుట్లలో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందడం అందులోనూ ఆయన ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ప్రజలంతా ఛీత్కరించుకోవడంతో ఎంపీగా పోటీ చేయడంపై అనేక అనుమానాలు చెలరేగుతున్నాయి. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే ఎమ్మెల్యేగా ఓటమి చెందిన వ్యక్తికి ఎంపీగా టికెట్ ఇవ్వొద్దంటూ బీజేపీ సీనియర్ నేతలంతా వరుస కట్టి ఫిర్యాదులు అందించారు.

### అధ్యక్షుడి మార్పుతో మంటలు..

బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బస్వా లక్ష్మీనర్సయ్యను మార్చడంతో సొంత పార్టీలోనే అర్వింద్‌కు వ్యతిరేకంగా సెగలు రేగుతున్నాయి. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని పదవి నుంచి తప్పించడంపై సదరు సామాజికవర్గానికి చెందిన వారంతా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నట్లుగా తెలిసింది. ఎంపీ ధర్మపురి అర్విందే ఇదంతా చేయించినట్లుగా బీజేపీలో సమాచారం దావానంలా వ్యాప్తి చెందడంతో వారంతా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా అరుణతారను బీజేపీ కొనసాగించగా నిజామాబాద్‌లో మాత్రం పారాచూట్ నేతకు ప్రాధాన్యం ఇవ్వడం సెగలు రేపుతున్నది. బస్వాను తప్పించినప్పుడు సీనియర్ నేతల్లో ఒకరికి పదవిని కట్టబెడతారని అందరూ ఊహించగా అందుకు విరుద్ధంగా నిర్ణయం వెలువడడంతో కాషాయ నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించి భంగపడిన వారు, జిల్లా అధ్యక్ష పదవుల్లో చోటు దక్కని వారంతా ఏకతాటిపైకి వచ్చి ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యవహరిస్తున్న తీరుపై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కోరుట్లలో ఓటమితో ఢిల్లీ పెద్దల ముందు అర్వింద్‌కు పలుకుబడి పూర్తిగా పోయింది. దీంతో ఎంపీ ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు బీజేపీ సీనియర్ నేతలంతా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. పెర్కిట్ శివారులో విద్యాసంస్థలను నడుపుతున్న బీజేపీ సీనియర్ నేత అల్జాపూర్ శ్రీనివాస్ ఇప్పటికే అధిష్టానానికి ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు కూడా చేసినట్లు తెలిసింది. యెండల లక్ష్మీనారాయణ సైతం ఎంపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లుగా సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షాలకు ఇప్పటికే అర్వింద్ వైఖరిపై ఫిర్యాదులు చేసినట్లుగా తెలుస్తున్నది.

# దివ్యాంగులకు మోటరు సైకిళ్ల పంపిణీ

వేల్పూర్, జనవరి 23: నియోజకవర్గానికి చెందిన ఆరుగురు దివ్యాంగులకు మోటరు సైకిళ్లను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం అందజేశారు. నాలుగు రెట్రో ఫిట్టెడ్ మోటర్‌సైజ్‌డ్ వాహనాలు, రెండు బ్యాటరీ ఆపరేటర్ వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ చాలా మంది అర్హులైన దివ్యాంగులు ఉన్నారని, వారందరికీ వాహనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు డ్యూటీ చీరెలను పంపిణీ చేశారు. భీమ్‌గల్ ప్రాజెక్టులో 47 మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమా జమున, ఉపేందర్, వైస్ ఎంపీపీ సురేశ్, జిల్లా ఆర్టీవో మెంబర్ రాములు, సామ మహిపాల్, తహసీల్దార్, ఎంపీడీవో, ఐసీడీఎస్ సీడీపీవో సుధారాణి, ఏసీడీపీవో జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.


వేల్పూర్‌లో మోటరు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# ఎస్సారెస్పీని సందర్శించిన 'జీఆర్ఎంబీ'

ముప్కాల్, జనవరి 23: మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ జలాశయాన్ని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారులు మంగళవారం సందర్శించారు. హైదరాబాద్ సీఈ హైడ్రాలజీ ఆధ్వర్యంలో కాకతీయ, సరస్వతీ, లక్ష్మి, వరద కాలువలతోపాటు గోదావరి నదిపై ఉన్న సోన్ బ్రిడ్జి వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా విడుదలవుతున్న నీటి వివరాలను సేకరించేందుకు గేజ్ స్టేషన్స్, ఆటోమెటిక్ వాటర్ లెవల్స్, రికార్డింగ్ స్టేషన్లను ఇన్‌స్టాల్ చేసినట్లు డీఈ గణేశ్ తెలిపారు. కార్యక్రమంలో జీఆర్ఎంబీ సభ్యులు రాజీవ్ కుమార్, ఎస్ఈ ప్రసాద్, ఈఈ రమణ మూర్తి, ప్రాజెక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్‌లో లివర్స్ పంపింగ్ కాలువను పరిశీలిస్తున్న అధికారులు

# అభంగపట్నంలో రైస్‌మిల్ సీజ్

- రూ.6.18కోట్ల కుంభకోణం జరిగినట్లు అధికారుల వెల్లడి
- యజమానిపై క్రిమినల్ కేసు నమోదు


రైస్‌మిల్‌ను సీజ్ చేసిన అధికారులు

నవీపేట, జనవరి 23: నవీపేట్ మండలం అభంగపట్నంలోని యూనిస్ ట్రేడర్స్ రైస్‌మిల్‌ను అధికారులు సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ జగదీశ్వర్, నార్త్ రూరల్ సీఐ సతీశ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రైస్‌మిల్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా డీఎం జగదీశ్వర్, సీఐ సతీశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతేడాది ప్రభుత్వం 25వేల క్వింటాళ్ల ధాన్యాన్ని నవీపేట మండలం అభంగపట్నం రైస్‌మిల్‌కు కేటాయించింది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉండగా రైస్‌మిల్ యజమాని యూనిస్ పక్కదారి పట్టించారు. ఇందులో సుమారు రూ. 6.18 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. యజమాని యూనిస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి రైస్‌మిల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్, సివిల్ సప్లయ్ డీటీ అశ్వక్, సిబ్బంది ఉన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

# పేదింటి ఆడబిడ్డలకు వరం 'కల్యాణలక్ష్మి'

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

వినాయక్‌నగర్, జనవరి 23: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరంలాంటిదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్లి చేసిన ఆడబిడ్డ కుటుంబానికి భారం కాకుండా ఆర్థిక సహాయం కింద రూ.లక్షా116 అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సౌత్, నార్త్ మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, స్రవంతి రెడ్డి, న్యాలం రాజు, ప్రవళిక, మమత, సుధీర్, వినోద్, శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా ఉంటాం..

**తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్‌పర్సన్ శోభ**

ముప్కాల్, జనవరి 23: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, వారి అభ్యున్నతికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు కృషి చేస్తుందని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ శోభ అన్నారు. ముప్కాల్ మండలంలోని రెంజర్లలో బ్యాంక్ నూతన భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాల కోసం ప్రైవేటు బ్యాంకుల వెంట తిరిగి అధిక వడ్డీలు చెల్లిస్తూ మోసపోవద్దని సూచించారు. వ్యవసాయ రుణాలు, ఎస్‌హెచ్‌జీలు, ఆధునిక యూనిట్ల అవసరం కోసం టర్మరిక్ బాయిలర్, చాప్ కట్టర్, ముద్రా రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మగ్గం, బ్యూటీ పార్లర్ యూనిట్లను చైర్‌పర్సన్ శోభ ప్రారంభించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, ముప్కాల్ ఏపీఎం ప్రసాద్‌రావు, సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్లు, సిబ్బంది సందీప్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

# ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

**రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి**

సారంగాపూర్, జనవరి 23: బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలు చేశామని తెలిపారు. గంగస్థాన్ ఫేస్-2లో ఉన్న తన నివాస ప్రాంగణంలో 72 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ హామీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం కానుకగా అందిస్తామని చెప్పారు. రైతుబంధు డబ్బులు నెలాఖరు వరకు రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పూర్ణచందర్ రాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

# కామారెడ్డి డిగ్రీ కళాశాల ఎంతో మందిని ఉన్నతస్థితికి చేర్చింది

**ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**


రాశివనంలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జనవరి 23: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంతో మందిని ఉన్నత స్థితికి చేర్చిందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసి రిటైర్డ్ అయిన అధ్యాపకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నో ఏండ్లుగా సేవలు అందించి రిటైర్ అయిన తర్వాత మళ్లీ ఇన్ని రోజులకు అందరూ సమావేశం కావడం ఆనందదాయకమన్నారు. కళాశాల ఏర్పడి 60 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దాదాపుగా 70 మంది ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకులు ఒక చోట చేరడం సంతోషమన్నారు. అనంతరం రాశివనంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు చంద్రకాంత్, శంకర్, రాజ్‌గంభీర్, పూర్వ అధ్యాపకుడు రంజిత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

